క్లుప్తంగా

17న డీ వార్మింగ్ డే

వరికుంటపాడు: వరికుంటపాడు పీహెచ్‌సీ పరిధిలో ఈ నెల 17న డీ వార్మింగ్ డే నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి కరిష్మా బుధవారం తెలిపారు. నులిపురుగులతో రక్తహీనత తలెత్తుతుందని చెప్పారు. మండలంలో ఏడాది నుంచి 19 ఏళ్లలోపు 3,200 మంది ఉన్నారని, వారందరికీ నులిపురుగుల నివారణకు అల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

తహసీల్దార్‌కు వినతి

మర్రిపాడు: మండలంలోని పల్లవోలు పంచాయతీ పరిధిలో ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుని భూమి లేని పేదలకు పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ స్వప్నను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు.

574 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు : మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 574 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 919 బేళ్లు రాగా, 345 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.358, కనిష్ఠంగా రూ.180, సగటున రూ.220.25 ధర పలికినట్లుగా వివరించారు. వేలంలో 12 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి



సీతారామపురం: స్థానిక పోలీస్‌స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న అబ్దుల్ ఖాదర్ (38) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. అనారోగ్యానికి గురైన ఆయన కొన్ని రోజులుగా నెల్లూరు నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఆయన మృతికి పోలీసులు సంతాపం తెలియజేశారు.

ఆధార్ తప్పనిసరి

సీతారామపురం: ప్రతిఒక్కరికీ ఆధార్ తప్పనిసరని ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవిరెడ్డి తెలిపారు. పంద్రంగి ఎస్టీ కాలనీలో బుధవారం ఆమె పర్యటించారు. గిరిజనులకు ఆధార్‌పై అవగాహన కల్పించారు. ఆధార్ లేని కారణంగా గిరిజనులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే ఆధార్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నాగరాజు, వీఆర్వో మనోహర్, పంచాయతీ కార్యదర్శి జీవన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

కావలి: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. కావలి డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సమస్యలతో పాటు సూచనలను 99592 25643 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని చెప్పారు.

గృహ నిర్మాణాల పరిశీలన

ఉదయగిరి/దుత్తలూరు/వరికుంటపాడు: ఉదయగిరి, దుత్తలూరు, వరకుంటపాడు మండలాల్లో ప్రభుత్వ గృహ నిర్మాణాలను విజిలెన్స్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లి, వెంగళరావునగర్, గండిపాళెం, దుత్తలూరు మండలం నర్రవాడ, దుత్తలూరు బిట్-1, బిట్-2, వరికుంటపాడులోని గృహ నిర్మాణాల నాణ్యతను విజిలెన్స్ ఏఈ వెంకటరెడ్డి ఆధ్వర్యంలోని బృందం తనిఖీ చేసింది. బేస్‌మెంట్, రూఫ్‌లెవెల్‌లో ఉన్న, పూర్తయిన ఇళ్ల కొలతలను నమోదు చేసుకున్నారు. ఉదయగిరిలోని సిమెంట్, స్టీలు గోదాముల్లోని స్టాక్‌ను తనిఖీ చేశారు. ఇన్‌చార్జి డీఈ వీశీ ప్రసాద్, ఏఈలు రామకృష్ణ, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు హర్షవర్ధన్, చెన్నారాయుడు, ఉన్నారు.

మూణ్ణాళ్ల ముచ్చట

- నాసిరకంగా నందవరం-ఉదయగిరి రోడ్డు నిర్మాణం
- గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి రూ.5.60 కోట్లు మంజూరు
- నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ చేతివాటం
- నాణ్యతను పట్టించుకోని అధికారులు
- పనులు పూర్తవకముందే లేచిపోతున్న రోడ్డు



నాణ్యత ప్రమాణాలను పాటించక దెబ్బతిన్న రోడ్డు నిర్మాణం



రెండు రోడ్లను సరిగా లింక్ చేయక లేచిపోతున్న కంకర

మర్రిపాడు: నందవరం-ఉదయగిరి రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ చేతివాటం చూపుతున్నారు. నాణ్యతకు నీళ్లొదిలి అత్యంత నాసిరకంగా పనులు చేపడుతున్నారు. దీంతో ఓ వైపు పనులు సాగుతుండగానే రోడ్డు లేచిపోతోంది. గత 15 ఏళ్లుగా రోడ్డు మరమ్మతులు, పునర్నిర్మాణానికి నోచుకోక అధ్వానంగా ఉంది. ఎట్టకేలకు గత ప్రభుత్వం రోడ్డు పునర్నిర్మాణానికి రూ.5.60 కోట్లను మంజూరు చేసింది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ అత్యంత నాసిరకంగా పనులు చేపడుతుండడంపై ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందవరం నుంచి ఉదయగిరి వరకు 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. గత 15 ఏళ్లుగా రోడ్డు పునర్నిర్మాణానికి నోచుకోక అధ్వానంగా తయారవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలోని గ్రామాల ప్రజలు రోడ్డు వసతి కోసం పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. ఎట్టకేలకు వారి నిరీక్షణ ఫలించి గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ.5.60 కోట్లను మంజూరు చేసింది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ తొలుత మండలం నందవరం నుంచి నందిపాడు సెంటర్ వరకు 21 కిలోమీటర్ల మేర పనులను ప్రారంభించారు. దీంతో తమ కష్టాలు తీరుతాయని ఆ మార్గంలోని గ్రామాల ప్రజలు సంతోషపడ్డారు. అయితే కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేపడుతుండడంతో వారు ఆవేదన చెందుతున్నారు. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడంతో పనులు పూర్తికాకముందే కంకర లేచిపోతోంది. రెండు రోడ్లను సరిగా కలపకపోవడంతో రోడ్డు దెబ్బతింటోంది. రోడ్డు పనుల నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తుతో పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యతతో పనులు చేపట్టేలా చూడాలని వాహనచోదకులు కోరుతున్నారు.

నాసిరకంగా రోడ్డు నిర్మాణం



నందవరం-ఉదయగిరి రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా సాగుతున్నాయి. ఓ వైపు పనులు జరుగుతుండగానే కంకలేచిపోతోంది. రెండు రోడ్లను సరిగా కలపకపోవడంతో లేచిపోయి దెబ్బతింటోంది. దాదాపు 15 ఏళ్ల తరువాత రోడ్డును పునర్నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– సుధాకర్, నెర్ధనంపాడు

నలుగురిపై కేసు నమోదు

ఆత్మకూరు : వినాయక చవితి నిమజ్జనోత్సవంలో చోటు చేసుకున్న దాడి ఘటనకు సంబంధించి నలుగురు యువకులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలో సోమవారం రాత్రి వినాయక నిమజ్జనోత్సవ ఊరేగింపులో ఓ విగ్రహ నిర్వాహకులు తాము ముందు వెళ్లాలనడంతో అక్కడ ఉన్న నలుగురు యువకులు వారిని దూషిస్తూ గొడవకు దిగగా పోలీసులు సర్దుబాటు చేశారు. ఆ తరువాత సదరు నిర్వాహకులపై విష్ణు, షఫీ, చైతన్య, ప్రతాప్ అనే నలుగురు యువకులు దాడికి పాల్పడడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జిలానీ తెలిపారు.

బీర్ బాటిల్‌తో దాడి

ఆత్మకూరు : బీర్ బాటిల్‌తో దాడికి పాల్పడిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు ఎస్సై జిలానీ తెలిపారు. మండలంలోని వాసిలి గ్రామానికి చెందిన పవన్, హర్షవర్ధన్, వినోద్, శివ మిత్రులు. మంగళవారం రాత్రి శివతో పని ఉండడంతో అతన్ని కలిసేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం వద్దకు పవన్ వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న హర్షవర్ధన్, వినోద్ పాతకక్షల నేపథ్యంలో బీర్ బాటిల్‌తో పవన్‌పై దాడికి పాల్పడ్డాడు. శివ వారించబోయినా వినిపించుకోలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు వినోద్, హర్షవర్ధన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ప్రదానం



ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

కావలి: పట్టణంలోని పాతూరులోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లను హెచ్‌ఎం సుబ్బారావు, ఎన్‌సీసీ అధికారి షేక్ మస్తాన్‌వలి, హవల్దార్ దేవేంద్రకుమార్‌శర్మ బుధవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గతేడాది జనవరిలో పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు 54 మంది ఏ సర్టిఫికెట్ పరీక్షకు హాజరుకాగా, 42 మంది ఏ గ్రేడ్, 12 మంది బీ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ పొందిన వారికి ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను పొందేందుకు దోహదపడుతుందని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ యువజన సంఘం

అల్లూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సీ వర్గీకరణను నిలిపివేసి మాలలందరికీ న్యాయం చేయాలని, ఎస్సీ కార్పొరేషన్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ యువజన సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, ఉపాధ్యక్షుడు దానం మాల్యాద్రి, మాల మహానాడు మండలాధ్యక్షుడు కమలాకర్, కలిసేటి వెంకటేషు, గంగపట్నం జీవన్‌పాల్, గొల్ల రాము, చంతాటి ప్రణయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ యువతకు కంప్యూటర్ శిక్షణ



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసులు

ఉదయగిరి: పట్టణంలోని కరీమావీధిలో ఉన్న ఉర్దూ అకాడమీ గ్రంథాలయాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రాపూరు, నెల్లూరు, ఉదయగిరిలోని ఉర్దూ అకాడమీ గ్రంథాలయాల్లో ఈ ఏడాది నుంచి మైనార్టీ యువతకు ప్రభుత్వం కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా గ్రంథాలయాలను సందర్శించి కంప్యూటర్లు, పుస్తకాలను పరిశీలించినట్లు వివరించారు. మరమ్మతులకు గురైన కంప్యూటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మైనార్టీ యువత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట గ్రంథాలయ నిర్వాహకులు జబీ ఉన్నారు.

నేడు ప్రత్యేక మహాజనసభ

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి సొసైటీలో గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక మహాజనసభ నిర్వహించనున్నట్లు సీఈఓ ఎస్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. సొసైటీకు సంబంధించిన లావాదేవీలపై చర్చించి ఆమోదించడంతో పాటు బకాయిదారులపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనున్నట్లు వివరించారు. సొసైటీ సభ్యులందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

వరికుంటపాడు సొసైటీలో రేపు

వరికుంటపాడు: స్థానిక సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక మహాజన సభ నిర్వహించనున్నట్లు సీఈఓ రత్తయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జమ, ఖర్చులపై చర్చించనున్నట్లు చెప్పారు. సొసైటీ పరిధిలోని సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

వరద బాధితులకు పొగాకు రైతుల సాయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని అధికారులు, పొగాకు రైతు సంఘ నాయకులు కలిసి విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాన్ని అందజేయాలని నిర్ణయించినట్లు కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ బుధవారం తెలిపారు. ప్రతి పొగాకు రైతు రూ.250 విరాళం అందజేసేలా నిర్ణయించారని, ఈ మొత్తాన్ని వారి పొగాకు అమ్మకాల్లో నుంచి మినహాయించనున్నట్లు చెప్పారు. అభ్యంతరాలు ఉన్న రైతులు తమ సూపర్‌వైజర్ ద్వారా తెలియజేయాలని కోరారు.

వినాయకుడి లడ్డూ వేలం

అనుమసముద్రంపేట: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏఎస్‌పేటలో బస్టాండ్ సెంటర్‌లోని వినాయకుడి ప్రతిమ వద్ద ఉంచిన లడ్డూ వేలం పాటను బుధవారం నిర్వహించారు. పోటా పోటీగా సాగిన వేలంలో మహేంద్ర అనే భక్తుడు రూ.67వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. అనంతరం ఉట్టి మహోత్సవం నిర్వహించి వినాయకుడ్ని నిమజ్జనం చేశారు.

కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: విజయవాడ వరద బాధితుల్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని, వారిని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసే అవకాశముందని, వరద ముప్పు ఉందని కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైనందున అనేక కాలనీలు వరదలకు అతలాకుతలం అయ్యాయన్నారు. వరదలు వచ్చిన మూడు రోజుల తర్వాత అధికారులు సహాయ చర్యలకు పూనుకోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ వైఫల్యంతో ప్రాణ, ఆస్తినష్టం ఎక్కువగా జరిగిందన్నారు. వరదల్లో చిక్కుకున్న వారికి కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని పరిస్థితి ప్రభుత్వం పనితీరుకు నిదర్శనమన్నారు. ఎంతోమంది చనిపోయారన్నారు. అనేక మంది రోగులకు మందులందక తీవ్ర అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. తన నివాసం వరదలో చిక్కుకోవడంతో చంద్రబాబు వరద ప్రాంతాల్లో హడావుడి చేస్తూ అధికార యంత్రాంగాన్ని తన వద్దే ఉంచుకుని ప్రజలను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వం విఫలమైన తీరు స్పష్టంగా కనిపిస్తున్నా తప్పును కప్పిపుచ్చుకుని వైఎస్సార్‌సీపీపై ఎదురుదాడికి దిగడం దారుణమన్నారు. వరద బాధితులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ కోరుతుండడాన్ని కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోందన్నారు. రాజధాని నడిబొడ్డులో జరిగిన వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. చేసిన తప్పులను సరిదిద్దుకుని బాధితులను ఉదారంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

కూలీల సంఖ్యను పెంచాలి

వరికుంటపాడు: ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ మల్లికార్జున, ఏపీఓ అజాంఖాన్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో పనులు ప్రారంభించాలని క్షేత్రసహాయకులకు సూచించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతికూలీకి పని కల్పించాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అమర వీరులకు నివాళులర్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

మర్రిపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఆత్మకూరు డివిజన్ ఫారెస్ట్ రేంజర్ శేఖర్ అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో మర్రిపాడులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాలయంలో 21 జాతుల మొక్కలు నాటుతున్నామని తెలిపారు. మొక్కలతోనే జీవకోటి మనగడ సాధ్యమన్నారు. భావితరాల మనుగడ కోసం ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం అటవీ శాఖ అమర వీరులకు నివాళులర్పిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ నాగమణి, ఎంఈఓ ధనలక్ష్మి, ఎస్సై శ్రీనివాసరావు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, ఏఓ రామ్మోహన్, కేజీబీవీ ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, డీఆర్వోలు రవీంద్రబాబు, ఖాజారంతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ఆత్మకూరురూరల్: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ



చేజర్లలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు



దుత్తలూరు: మందాలనాయుడుపల్లిలో..

ఆత్మకూరురూరల్: బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సునీలత పేర్కొన్నారు. దేపూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కేశవ నారాయణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేజర్ల: చేజర్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన పోషకాహార మాసోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సురేఖ పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. 15ఏళ్లలోపు పిల్లలకు వివాహాలు చేయడం నేరమన్నారు. ఏఎన్‌ఎం నారాయణమ్మ, వేణమాధవి, ఎస్ దేవి, ఆశావర్కర్లు ఏ వెంకటలక్ష్మి పవిత్రకుమారి, ఎన్ అనిత పాల్గొన్నారు.

దుత్తలూరు: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను తెలిపారు. మండలంలోని మందాలనాయుడుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కాయగూరలు, గుడ్లు, పాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలు రాధ, లక్ష్మీప్రసన్న, వరమ్మ పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని తూర్పుకొండారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. వరికుంటపాడు అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ షాను పోషకాహారంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు హేమలత, కార్యకర్తలు తిరుపతమ్మ, రజియ, చిన్ని, శైలజ పాల్గొన్నారు.

కలిగిరి: పెద్దకొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ వింజమూరు సెక్టార్ సీడీపీఓ సీహెచ్ పద్మజకుమారి, సూపర్‌వైజర్ హైమావతి, మహిళా పోలీస్ కే సౌమ్య, అంగన్‌వాడీ కార్యకర్త షహిదా, తదితరులు పాల్గొన్నారు.



కలిగిరి మండలం పెద్దకొండూరులో..



వరికుంటపాడు మండలంలో..

గణేశ్ నిమజ్జన కోలాహలం

ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో బుధవారం గణేశ్ నిమజ్జన కోలాహలం నెలకొంది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజున పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి ప్రతిమల వద్ద ఉట్టి మహోత్సవాలు, లడ్డూ ప్రసాదాల వేలం నిర్వహించారు. అనంతరం గణనాథుడి ప్రతిమలను విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనాలపై కొలువుదీర్చి డీజేలు, మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పిల్లలు, పెద్దలు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



సీతారామపురం: నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథులు



సంగం: గణేశ్ నిమజ్జనోత్సవంలో చిన్నారుల సందడి



అల్లూరులో..